సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 18 । ఏప్రిల్ । 2025



ఎస్ఐ ఇల్లు సహా నాలుగు చోట్ల చోరీ

ప్రొద్దుటూరులో కొన్ని రోజుల నుంచి వరుస చోరీలు చేస్తూ దొంగలు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. ఈ సారి ఎస్ఐ ఇంటినే టార్గెట్ చేశారు. -10లో



యువకుడు లాకప్ డెత్!

కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న షేక్ సోను అలియాస్ పండా (23) అనే యువకుడు గురువారం తెల్లవారుజామున 'లాకప్ డెత్'కు గురయ్యాడు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.6/29.9

జిల్లాలో గురువారం 29.9 - 39.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

'వక్ఫ్'బిల్లుపై సుప్రీంలో పిల్



సుప్రీంకోర్ట్‌లో పిల్ దాఖలు చేయడానికి వెళ్లిన ముస్లిం మత గురువులు

జమ్మలమడుగు రూరల్: వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పలువురు పీఠాధిపతులు సుప్రీం కోర్ట్‌లో పిల్ దాఖలు చేశారు. గురువారం కదిరి కుటాగుళ్లకు చెందిన సయ్యద్ ఖాజా ఉబేదుల్లా హుసేని (సజ్జాదే నషీన్), జమ్మలమడుగు అస్థాన ఏ గౌసియా పీఠాధిపతి తరుపున ఆయన కుమారుడు సయ్యద్ షా తాహీర్ పీరా ఖాద్రీలు వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్‌ను వ్యతిరేకిస్తూ పిల్ దాఖలు చేసినట్లు వారు తెలిపారు.

యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

కడప సెవెన్‌రోడ్స్: ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన, అలాగే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించే యాదవ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించనున్నామని రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి.నారాయణయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షకు మించరాదని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివి ఉండాలన్నారు. విద్యార్థులు తమ బయోడేటా, మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, ఫొటోలను జతపరిచి పంపాలన్నారు. ఇతర వివరాలకు 94408 49234 , 94406 51405 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు సిద్దవటం కోటలో వారసత్వ దినోత్సవం

సిద్దవటం: సిద్దవటంలోని మట్లిరాజుల కోటలో శుక్రవారం ప్రపంచ వారసత్వ దినత్సోవం నిర్వహించనున్నట్లు జిల్లా పురాతత్వ సర్వేక్షణాధికారి డాకారెడ్డి తెలిపారు.సిద్దవటం కోటను గురువారం ఆయన సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. చారిత్రక కట్టడాలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ సత్యనారాయణ, ఎంటీఎస్ సిబ్బంది స్వరూప్‌రామ్, నందకిషోర్, నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో ఆర్టీ -2009 ప్రకారం ఉచిత ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్, సమగ్రశిక్ష ఏపీసీ నిత్యానందరాజులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అన్ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాల్లో ప్రతి కూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. ఐదేళ్లు నిండిన వారికే 1వ తరగతిలో మాత్రమే అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీఎస్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 31వ తేదీ మార్చి 2025 నాటికి 5 ఏళ్లు నిండి ఉండాలన్నారు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 1వ తేదీ 2025 నాటికి 5 సంవత్సరాలు నిండి ఉండాలని చెప్పారు. ఈ నెల 28నుంచి మే 15వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 18004258599 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధ్యాపకుల సంఘం ఎన్నిక ప్రశాంతం



అధ్యాపకుల సంఘం నాయకులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామక్రిష్ణారెడ్డి వరుసగా ఏడవ సారి ఎన్నికయ్యాడు. అలాగే ఉపాధ్యక్షుడిగా నరసింహులు, సెక్రటరీగా శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీగా రవీంద్రరెడ్డి, ట్రెజరర్‌గా రమణయ్య, మహిళా కార్యదర్శిగా విజయలక్ష్మీ, స్టేట్ కౌన్సిలర్లుగా సాయినాథ, పద్మావతిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

పేదింట.. చదువుల పంట

- ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీల్లో మెరుగైన ఫలితాలు
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఐదు కేజీబీవీల్లో 100 శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో ఒక కేజీబీవీ వందశాతం ఉత్తీర్ణత
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో స్టేట్ టాపర్‌గా నిలిచిన కలసపాడు విద్యార్థి
- ద్వితీయ సంవత్సరంలో 966 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన మల్లేశ్వరి



ప్రథయ, ద్వితీయ సంవత్సర ఫలిలాల్లో వందశాతం ఫలితాలు సాధించిన చక్రాయపేట కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయం నెరవేరుతోంది. ఆయన హయాంలో పునాది వేసుకున్న 'కస్తూర్బా' సౌధం ఎందరో బాలికలకు నీడనిస్తోంది. పేదల ఇంట చదువుల పంట పండిస్తోంది. తాజాగా విడుదలైన ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించి శభాష్ అనిపించారు.

- మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005లో కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీలు)ఏర్పాటు చేశారు. ఉన్నత చదువులు చదవాలని ఆసక్తి ఉన్నా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన, ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడేవారికి కేజీబీవీలు వరంగా మారాయి. నేడు ఎంతో మంది నిరుపేద బాలికలు విద్యావంతులై తమ ప్రతిభను చాటుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంగ్లిషు మీడియంలో బోధన, అత్యంత భద్రతతో కూడిన వసతి సదుపాయాలు కల్పించారు. ఈ విద్యాలయాల్లో సాధారణ విద్యతోపాటు ఆంగ్లమాధ్యమం, యోగా, క్రీడలతోపాటు వృత్తి విద్యాకోర్సుల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తూ బాలికల చదువులతోపాటు బతుకు దెరువుకు భరోసానిస్తున్నాయి.
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాడు- నేడు మనబడి కార్యక్రమం ద్వారా కేజీబీవీలలో లక్షలు ఖర్చు చేసి మరిన్ని వసతులు, సౌకర్యాలను కల్పించారు. దీంతోపాటు పదో తరగతి తరువాత బాలికలు డ్రాపౌట్స్‌గా మారేందుకు వీలులేకుండా కేవీజీబీలలో ఇంటర్ విద్యను కూడా ప్రవేశ పెట్టారు. ఆ ఇంటర్ విద్యలో నేడు బాలికలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాల్లో రాణిస్తున్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలే నేడు చదువుల విప్లవం కనిపిస్తోందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ఉన్న 16 కేజీబీవీలో సగానికిపైగా కేజీబీవీలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. ఇందులో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 16 కేజీబీవీలలో ఒక కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఐదు కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఇందులో కలసపాడు కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీ గ్రూపుకు చెందిన వీరదాసరి మైథిలీ 897 మార్కులు సాధించి రాష్ట టాపర్‌గా నిలిచి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా షైనింగ్ స్టార్ అవార్డును అందుకుంది. ఇందుకుగాను ఆ విద్యార్థికి లాప్‌టాప్‌తోపాటు బంగారు పతకం అందజేసి అభినందించారు.

సంతృప్తికర ఫలితాలు



కేజీబీవీల్లో ఇంటర్ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. ప్రథయ సంవత్సరానికి సంబంధించి 85.60 శాతం, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 80.62 శాతం ఉత్తీర్ణతను సాధించాం. 17 కేజీబీవీలకుగాను ఇంటర్మీడియట్ ఉన్న 16 కేజీబీవీలలో ఆరు కేజీబీవీల్లో వందశాతం ఉత్తీర్ణతను సాధించాం. ఫలితాల పరంగా చాలా సంతోషంగా ఉంది.

– షేక్ షంషుద్దీన్ , జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రథమ సంవత్సర టాపర్స్ వీరే



వైష్ణవి
ఎంపీసీ/453



స్వర్ణ
బైపీసీ/427



పూజ
హెచ్ఈసీ/370



నాగతేజేశ్వరి
ఒకేషనల్/481

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి పోరుమామిళ్ల కేజీబీవీకి సంబంధించి ఎంపీసీ విభాగంలో వైష్ణవి 453 మార్కులు సాధించింది. అలాగే బి.కోడూరు కేజీబీవీ విద్యార్థిని సువర్ణ బైపీసీ విభాగంలో 427 మార్కులను, కలసపాడు కేజీబీవీకి సంబధించి పూజ హెచ్ఈసీలో 370 మార్కులను సాధించగా అలాగే జమ్మలమడుగు కేజీబీవీకి సంబంధించి ఒకేషనల్ విభాగం ఎంపీహెచ్‌డబ్లూలో నాగతేజశ్వరి 481 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు.

ద్వితీయ సంవత్సరం టాపర్స్..



సువర్ణ
ఎంపీసీ/955



మల్లేశ్వరి
బైపీసీ/966



మైథిలి
హెచ్ఈసీ/897



సాయిదిల్‌షాద్
ఒకేషనల్/948

దువ్వూరు కేజీబీవీ నుంచి ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సర విద్యార్థిని సువర్ణ 955 మార్కులు సాధించింది. అలాగే బి కోడూరు కేజీబీకీ నుంచి ద్వితీయ బైపీసీకి సంబంధించి మల్లేశ్వరి 966 మార్కులు, కలసపాడు కేజీబీవీ నుంచి ద్వితీయ హెచ్ఈసీకి సంబంధించి వీరదాసరి మైథిలి 897 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. జమ్మలమడుగు కేజీబీవీ నుంచి ద్వితీయ ఒకేషనల్‌కు సంబంధించి ఎంపీహెచ్‌డబ్లూలో సాయి దిల్‌షాద్ 948 మార్కులు సాధించి టాపర్స్‌గా నిలిచారు.



రాష్ట్రటాపర్ వీరదాసరి మైథిలిని సన్మానించి నగదు బహుమతిని అందచేస్తున్న స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి

కేజీబీవీ ఫలితాలు ఇలా...

కేజీబీవీలకు సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 289 మంది పరీక్షలు రాయగా ఇందులో 247 మంది ఉత్తీర్ణులై 85.60 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 335 మంది పరీక్షరాయగా ఇందులో 273 మంది సాపై 80.62 శాతం ఉత్తీర్ణత సాధించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీ వివరాలు ఇలా...

ప్రథమ సంవత్సరానికి సంబంధించి...



ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి చక్రాయపేట కేజీబీవీ 30 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రా యగా 30 మంది ఉత్తీర్ణులై వందశాతం ఉత్తీర్ణతను సాధించారు.

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి....



ద్వితీయ సంవత్సరంలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన దువ్వూరు కేజీబీవీ

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి ఐదు కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో వేముల కేజీబీవీలో 19 మంది, సింహాద్రిపురం కేజీబీవీలో 14 మందికి 14 మంది, మైదుకూరు కేజీబీవీలో 18 మందికి 18 మంది, చక్రాయపేట కేజీబీవీలో 18 మందికి 18 మంది, దువ్వూరు కేజీబీవీలో 22 మందికి 22 మంది ఉత్తీర్ణులై వందశాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం.

వైవీయూకు రూ.10 కోట్ల ప్రాజెక్టు మంజూరు

వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు



ప్రాజెక్టుకు సంబంధించిన పత్రాన్ని, అధ్యాపకులతో కలిసి చూపుతున్న వీసీ అల్లం శ్రీనివాసులరావు

కడప ఎడ్యుకేషన్: అకడమిక్, రీసెర్చ్ ఎక్సలెన్స్ దిశగా దూసుకెళ్తున్న యోగి వేమన విశ్వవిద్యాలయానికి మెగా రీసెర్చ్ ప్రాజెక్ట్ మంజూరైంది. 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ 'పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏ ఎన్ ఆర్ ఎఫ్-పి.ఎ.ఐ.ఆర్) పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిసి రూ. 10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టు కోసం యోగి వేమన విశ్వవిద్యాలయంలో రోగనిర్ధారణ, మెటబాలిక్, ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధుల చికిత్సలు, వ్యాధి నిఘా యంత్రాంగంపై దృష్టి సారించే మొత్తం 22 ప్రతిపాదనలను వివిధ విభాగాలలో కలసి 27 మంది అధ్యాపకులు సమర్పించారు. ప్రాజెక్టు నిధులతో పరిశోధనలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని స్పోక్ సంస్థగా ఎంపిక చేయడం, ఆ తర్వాత ప్రతిష్టాత్మకమైన ఎఎన్ఆర్ఎఫ్-పీఏఐఆర్ గ్రాంట్‌ను అందించడం వెనక విశ్వవిద్యాలయంలో నాణ్యమైన బోధన, పరిశోధన ఉన్నత ప్రమాణాలే కారణమన్నారు. పరిశోధన నిధులతో నాణ్యమైన పరిశోధనలు చేస్తామన్నారు. పరిశోధనల కేంద్రంగా, పరిశోధన వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. ప్రొఫెసర్ కె. కృష్ణా రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా. పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథ రెడ్డి, ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎల్.సుబ్రహ్మణ్యంశర్మ, డీన్ ప్రొఫెసర్ ఎ.జి.దాము, డీన్ ఆర్ అండ్ డి ప్రొఫెసర్ చంద్ర ఓబులరెడ్డి, ప్రొఫెసర్ దాక్షాయణి, ప్రొఫెసర్ ఎ.రామచంద్రారెడ్డి, పిఆర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పి.సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొరాయించిన జలాశయం గేటు

- మైలవరం దక్షిణ కాల్వలో ఇరుక్కుపోయిన గేటు
- కిందికి దించడానికి సిబ్బంది ప్రయత్నాలు విఫలం



దక్షిణ కాలువ గేటు మొరాయిస్తున్న ప్రదేశం

జమ్మలమడుగు రూరల్: మైలవరం జలాశయం నుంచి ప్రొద్దుటూరు మీదుగా వెళ్లే దక్షిణ కాలువ కొన్ని నెలల నుంచి ప్రవహిస్తోంది. 5 నెలల క్రితం కాలువ వెంట పరిమితికి మించి నీళ్లు వస్తుండటంతో ఇవి కాస్త పొలాల్లోకి వెళ్లి అడ్డంగా పారుతున్నాయి. దీంతో తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయంటూ నర్సోజీకొట్టాల, పొన్నతోట రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. అసలు విషయానికి వస్తే దక్షిణ కాలువకు అడ్డంగా ఉండాల్సిన జలాశయం గేటు కిందికి దిగడం లేదు. గతంలో దక్షిణా కాలువ ద్వార ప్రొద్దుటూరు ప్రాంతానికి నీటి అవసరాల కోసం అధికారులు గేటును కాస్త పైకి ఎత్తి వదిలేశారు. ఆ తరువాత పట్టించుకోక పోవడంతో గేటు కింది భాగం రబ్బరు సీల్స్ దెబ్బతినడంతో పూర్తిగా స్ట్రక్ అయింది. వారం క్రితం గేటు దించడానికి సిబ్బంది ఎంత ప్రయత్నం చేసినా దిగనంటూ మొరాయించడంతో సిబ్బంది చేసేదిలేక వెనుదిరిగారు.



పొన్నతోట గ్రామ పొలాల్లోకి పారుతున్న నీరు (ఫైల్)

నీరు తగ్గితే పనులు చేస్తాం

ప్రస్తుతం మైలవరం జలాశయంలో నీరు ఉండటంతో దక్షిణ కాలువ గేటు మరమ్మతులు చేయలేకపోతున్నాం. గేటు కింది భాగాన రబ్బర్ సీల్స్ దెబ్బతిని ఉన్నాయి. జూన్, జులై మాసంలో జలాశయంలో నీరు తగ్గిన వెంటనే మరమ్మతులు నిర్వహిస్తాం. దక్షిణ కాలువ ద్వారా ప్రతి రోజూ 20 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం 2.9 టీఎంసీల నీరు ఉన్నాయి.

– నరసింహమూర్తి, డీఈ, మైలవరం జలాశయం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గాలివానకు దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- తమ గోడును విలపిస్తూ ఎంపీకి మొరపెట్టుకున్న మహిళా రైతులు



నేలకూలిన అరటి గెలను పరిశీలిస్తున్న ఎంపీ



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల: అకాల వర్షాలు రైతులకు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఇటీవల వీచిన ఈదురు గాలులకు లింగాలలో భారీ స్థాయిలో అరటి తోటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పర్యటించారు. ఈదురుగాలు లు, వడగండ్ల వానకు తీవ్రంగా దెబ్బతిన్న, నేలకూలిన అరటి పంటలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని యోడుగూరు ప్రతాప్‌రెడ్డి, వేలూరు ఆనంద్‌రెడ్డి, తేరా గంగాధరరెడ్డి, రామచంద్రారెడ్డిల అరటి తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును విలపిస్తూ ఎంపీ అవినాష్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. వారం రోజుల్లో చేతి కందే పంట నోటికి అందకుండా పోయిందని, పంట సాగు కోసం లక్షలాది రూపాయలు వెచ్చించామని పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొందని రైతులు విలపించారు. పంట చేతికి వస్తే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేద్దామనుకున్నామని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఉందని.. తమను ఆదుకోవాలంటూ లోకేశ్వర మ్మ, వేలూరు నీలిమలు ఎంపీకి మొర పెట్టుకున్నారు.

- ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వడగండ్ల వానకు మండలంలోని లింగాల, గుణకణపల్లె, చిన్నకుడాల, రామట్లపల్లె, పెద్దకుడాల, కామసముద్రం, బోనాల గ్రామాల్లో సుమారు 750ఎకరాలలో అరటి పంట నేలకూలిందన్నారు. మూడు వారాల క్రితమే మండలంలోని తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, వెలిదండ్ల, ఎగువపల్లె గ్రామాల్లో 1450ఎకరాలలో అరటి పంట ఈదురుగాలులు, వడగండ్ల వానకు తీవ్రంగా దెబ్బతిందన్నారు. మూడు వారాల వ్యవధిలోనే 2150ఎకరాలలో అరటి తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రైతులు పంటల సాగు కోసం ఎకరాకు రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చిందన్నారు. దీంతో మండల వ్యాప్తంగా రూ.42కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన అన్నారు. రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని, ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు వాతావరణ భీమాను రైతులకు అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్చి నెలలో కూలిపోయిన అరటి పంటలకు మార్చి 31వ తేదీలోగా ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తామని చెప్పిందని, ఇంతవరకు ఇవ్వ లేదని ఆయన తూర్పారబట్టారు. ప్రభుత్వం ఎకరాకు రూ.14వేలు ఇన్‌పుట్ సబ్సిడీ మాత్రమే అందిస్తోందని, ప్రభుత్వం అందించే ఈ ఇన్‌పుట్ సబ్సిడీ కూలిపోయిన అరటి తోటలను తొలగించడానికి కూడా సరిపోదని మండిపడ్డారు. ఒక్క ఎకరాలో కూలిన అరటి పంటను తొలగించుకోవడానికి రైతులు రూ.20వేల నుంచి రూ.25వేలు కూలీలకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. 2024 ఖరీఫ్‌కు సంబంధించిన ఈ అరటి పంట 2023 ఇన్సూరెన్స్ గైడ్‌లైన్స్ ప్రకారం 2024-25కు వాతావరణ భీమా వర్తింపజేసి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు వాతావరణ బీమా అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు మండలంలో పనిచేయడం లేదని, కొన్ని పనిచేస్తున్నా అవి కచ్చితమైన వెదర్ అప్‌డేట్ అందించడంలేదని, పాడైపోయిన వాటిని వెంటనే తొలగించి నూతన ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను, డివైజర్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం సాకులు వెతకకుండా ఉద్యాన శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫొటోలు, రైతుల వివరాలను పరిగణలోకి తీసుకుని ఇన్‌పుట్ సబ్సిడీ, వాతావరణ బీమాలు అందించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి, నియోజకవర్గ రైతు విభాగపు కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మల్లికార్జునరెడ్డి, మల్లికేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ మండల కన్వీనర్ బాలసముద్రం రవి, లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వైఎస్సార్ సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ భాస్కర్ రెడ్డి, పెద్ద కుడాల మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, హుక్కులు వారిపల్లె సర్పంచ్ భాస్కర్ రెడ్డి, రామన్నూతనపల్లె, పెద్దకుడాల, లింగాల, చిన్నకుడాల గ్రామాలకు చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయం నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, తాగునీటి సరఫరా తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితి సింగ్ హాజరయ్యారు. సీఎస్ వీసీ ముగిసిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 19న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ మాసంలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్'(ఈ వేస్ట్ రీసైక్లింగ్) అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ అంశానికి సంబంధించి సంబంధిత శాఖల నిపుణులతో ఒక వర్క్ షాపు కూడా నిర్వహించాలని కేఎంసి కమీషనర్ కు సూచించారు. ఇసుక నిల్వలను పెంచుకోవాలని ప్రభుత్వం సూచించిందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిపివో రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అపోహతోనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఫిర్యాదు

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా వేములకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై అపోహతో తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని కడప నగరంలోని హోమియో వైద్య కళాశాల విద్యార్థిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్‌పై అపోహపడి, అబద్ధపు ప్రచారాలు నిజమనుకుని అతనిపై పోలీసుల ఫిర్యాదు చేశానన్నారు. తరువాత పోలీసుల విచారణలో ఆయన తప్పేమీలేదని తెలియడంతో తన ఫిర్యాదును ఉపసంహరించుకున్నానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మైదుకూరు : మైదుకూరు మండలం ఆదిరెడ్డిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయలపాటి సిద్ధయ్య (35) అనే వ్యక్తి మృతి చెందాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని బుడగ జంగాల కాలనీకి చెందిన సిద్ధయ్య ప్లాస్టిక్ బిందెలు, స్టీల్ సామాన్లను గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తుంటాడు. బుధవారం ప్రొద్దుటూరులో సామాన్లను కొనుగోలు చేసేందుకు బంధువు జమ్మయ్యతో కలిసి మోటార్ సైకిల్‌పై వచ్చాడు. తిరిగి గిద్దలూరుకు వెళుతుండగా రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆదిరెడ్డిపల్లె వద్ద ఎదురుగా వస్తున్న వాహనం లైటింగ్‌లో దారి కనిపించక రోడ్డు పక్కన ఉన్న కల్వర్టును ఢీకొట్టాడు. సంఘటనలో రోడ్డుపై నుంచి కిందపడిన సిద్ధయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్‌సైకిల్‌పై వెనుక వైపున కూర్చున్న జమ్మయ్య గాయాలతో బయటపడ్డాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ ఏఎస్ఐ మురళీ తెలిపారు.

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు రామకృష్ణ

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో అప్పుల బాధ భరించలేక మడక రామకృష్ణ(49) అనే కౌలు రైతు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు రామకృష్ణ గత కొన్ని సంవత్సరాలనుంచి ఉప్పలూరు పరిసర గ్రామాల్లో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. కౌలు వ్యవసాయంలో ఆదాయం లేకపోవడంతో అప్పులపాలయ్యాడు. చివరికి అప్పులు తీర్చలేని దుస్థితికి చేరుకున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామకృష్ణ తిరిగి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం ఉప్పలూరులోని ఓ పొలంలో వేపచెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

యువకుడు లాకప్ డెత్!

- ఆర్డీఓ విచారణలో యువకుడు టూ టౌన్ పోలీస్ స్టేషన్ బాత్‌రూంలో ఉరి వేసుకున్నట్లు నిర్ధారణ
- యువకుడి తల్లి చేత కడుపు నొప్పితో మృతి చెందాడని చెప్పించిన పోలీసులు
- విచారణ అధికారిగా జమ్మలమడుగు డీఎస్పీ నియామకం



కడప రిమ్స్ మార్చురీలో షేక్ సోను మృతదేహం, మృతుని తల్లి, బంధువులు

కడప అర్బన్ : కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో వున్న షేక్ సోను అలియాస్ పండా (23) అనే యువకుడు గురువారం తెల్లవారు జామున 'లాకప్ డెత్'కు గురయ్యాడు. పోలీసు అధికారులు, సిబ్బంది ఈ సంఘటనను మసిబూసి మారేడు కాయ చేసేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. ఈ సంఘటనలో మృతుని తల్లి షేక్ చానును, బంధువులను భయపెట్టారో, బాధపెట్టారో తెలీదుకానీ ఆమె చేత కూడా తమ కుమారుడికి కడుపునొప్పి ఉందని, గంజాయి అలవాటు ఉండేదని ఈ క్రమంలో పోలీసులు పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చారని, రిమ్స్‌కు తీసుకుని వచ్చిన తరువాత చికిత్స పొందుతూ మృతి చెందాడని చెప్పించారు. వాస్తవ నిర్ధారణ కోసం వచ్చిన కడప ఇన్‌చార్జి ఆర్డీఓ, బద్వేల్ ఆర్డీఓ ఏ. చంద్రమోహన్ విచారణలో యువకుడు కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాత్‌రూంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. ఆయన తమ సిబ్బందితో కడప రిమ్స్ మార్చురీకి చేరుకుని షేక్ సోను మరణంపై అతని తల్లి షేక్ చాను, బంధువులను గురువారం విచారించారు. అనంతరం ఆయన సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆ తర్వాత పోలీసు అధికారులు, సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షేక్ సోను అనే యువకుడు కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గంజాయి కేసులో విచారణకు వచ్చాడని, బాత్‌రూంకు వెళ్లి తన చొక్కాతో కిటికీకి వున్న 'గ్రిల్'కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడరి ప్రాథమిక నిర్ధారణకు వచ్చామన్నారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించామన్నారు. జ్యుడిషియల్ విచారణలో షేక్ సోను స్టేషన్‌కు ఎప్పుడు వచ్చింది, తరువాత మరణించేవరకు ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, సంబంధిత పోలీసు అధికారులను, సిబ్బందిని సమగ్రంగా విచారిస్తామన్నారు.

మృతుని తల్లి షేక్ చాను ఏమంటున్నారంటే..

కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మాసాపేటకు చెందిన షేక్ సోను (23) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటనపై అతని తల్లి షేక్ చాను, బంధువు ముంతాజ్‌లు మాట్లాడుతూ తమ కుమారుడికి అప్పుడప్పుడు కడుపునొప్పి వచ్చేదని, ఈ క్రమంలో గంజాయి కేసులో ఇంతకుముందు మాదిరిగానే ఈనెల 16వ తేదీన రాత్రి కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారన్నారు. తెల్లవారుజామున తమకు పోలీసులు ఫోన్ చేసి మీ కుమారుడు కడుపునొప్పితో బాధపడుతూ ఉంటే రిమ్స్‌కు తీసుకుని వచ్చామని తెలిపారన్నారు. తాము కడప రిమ్స్‌కు వచ్చినప్పుడు తమ కుమారుడు చికిత్స పొందుతున్నాడని, తరువాత మృతి చెందాడని తెలిపారు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లుగానీ, అతని మృతిపైన ఎలాంటి అనుమానాలు లేవని మీడియాకు వివరించారు.

సంఘటనపై అనుమానాలెన్నో..

కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాసాపేటకు చెందిన షేక్ సోను(23)పై వివిధ పోలీస్ స్టేషన్‌లలో చోరీ, గంజాయి కేసులున్నాయి. ఇటీవల కడప రిమ్స్ పీఎస్ పరిధిలో ఓ చోరీ కేసులో ఆ స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసినట్లు సమాచారం. ఈనెల 15 వ తేదీన ఇంటి నుంచి వెళ్లి మరలా ఇంటికి రాలేదు. రెండు రోజుల నుంచి పోలీసుల అదుపులో వున్నాడా? లేక ఈనెల 16 వ తేదీన కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారా అనేది తెలియాల్సి ఉంది. 2024 సంవత్సరంలో ఇతనిపై నమోదైన గంజాయి కేసులో అరెస్టు చేసి ఈనెల 17వ తేదీన మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించాలని అనుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకుని షేక్ సోను తీవ్ర మనస్థాపానికి గురై పోలీస్ స్టేషన్‌లోనే ఉన్న బాత్ రూంకు వెళ్లి అక్కడున్న గ్రిల్‌కు చొక్కాతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎంతసేపటికి రాకపోవడంతో పోలీసు సిబ్బంది గమనించి అతన్ని బయటకు తీసుకుని వచ్చి వెంటనే రిమ్స్‌కు తరలించి, అతని తల్లి, బంధువులకు సమాచారం ఇచ్చారు.ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావును నియమించారు. కాగా ఈ సంఘటనపై గురువారం రాత్రి వరకు జిల్లా పోలీసు అధికారులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసు అధికారులు

కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల అదుపులో వున్న షేక్ సోను (23) అలియాస్ పండా అనుమానాస్పద మృతి సంఘటనపై జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. గురువారం ఉదయం డీఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని కడప టూటౌన్ పోలీస్ స్టేషన్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో కడపతో పాటు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి కడప టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు.

వక్ఫ్ బిల్లును ముక్త కంఠంతో తిరస్కరిద్దాం


మాట్లాడుతున్న హజరత్ సయ్యద్‌షా హుసేని బాషా షామీరి సాహెబ్

కడప కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం బలవంతంగా అంటగడుతున్న వక్ఫ్ బిల్లును కేవలం ముస్లింల అణిచివేతకే ఉద్దేశించారని, దీనిని ముస్లింలతోపాటు ప్రజాస్వామ్య వాదులందరూ ముక్త కంఠంతో తిరస్కరించాలని పలువురు ముస్లిం పెద్దలు పిలుపునిచ్చారు. గురువారం కడప నగరం రామరాజుపల్లె వద్దగల షాహి మహల్ కల్యాణ మండపంలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆస్థాన ఏ షహమీరియా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా హుసేని బాషా షామీరి సాహెబ్, మత గురువు హజరత్ వలివుల్లా హుసేని సాహెబ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ముస్లింల ఉమ్మడి ఆస్తుల రక్షణ కోసం వక్ఫ్‌బోర్డును ప్రభుత్వం కేవలం పర్యవేక్షించేదన్నారు. అంతకుమించి ప్రభుత్వాలకు ఆ ఆస్తులపై హక్కు ఉందనడం చట్ట వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం వక్ఫ్ బిల్లును ఆమోదించకూడదని, ప్రభుత్వం దాన్ని ముస్లింలకు ఉపయోగకరంగా ఉండేలా మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్ పర్సన్ ముఫ్తి సయిద్ అహ్మద్ బాక్వి, కన్వీనర్ సయ్యద్ అబ్దుల్ రెహమాన్ బగ్దాది, సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి, ముఫ్తి సయ్యద్ గౌస్ అహ్మద్, మౌలానా మొగల్ మస్తాన్, మొహమ్మద్ వలిబాషా, ముస్లిం ప్రముఖులు, మజీద్ కమిటీ సభ్యులు, దర్గా కమిటీ సభ్యులు, మౌల్వీలు, ముఫ్తీలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ కంపెనీకి భూమి కేటాయించలేదు


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న గ్రామస్తులు

జమ్మలమడుగు : సోలార్ నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ నుంచి ప్రభుత్వ భూమి ఎంత ఉందో తెలుపమని తమకు సమాచారం వచ్చిందే తప్ప ఆ కంపెనీకి ఎలాంటి భూమిని కేటాయించలేదు.. జీఓలు ఇవ్వలేదని తహసీల్దార్ నరసింహులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొండపాపాయపల్లె పంచాయతీలో 224 సర్వే నంబర్‌లో 501 ఎకరాల భూమి ఉందన్నారు. గతంలో పశువుల మేత కోసం ఉంచిన భూమిని సబ్ డివిజన్ చేసి 147 ఎకరాల భూమిని నిరుపేదలకు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మిగిలి ఉన్న భూమిని ఎవ్వరికి కేటాయించలేదని తెలిపారు.

సోలార్ కంపెనీ ప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఎలాంటి అనుమతులు లేకుండా తమ గ్రామానికి సంబంధించిన పశువుల మేత కొండలో పెద్ద పెద్ద చెట్లను తొలగించిన కంపెనీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, తిమ్మారెడ్డి నాయకత్వంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సోలార్ యాజమాన్యం కొండపై ఉన్న రాళ్లతోపాటు చెట్లను కూడ తొలగించిందన్నారు. ఇప్పటి వరకు తమకు అనుమతులు ఉన్నాయని , ప్రభుత్వం నుంచి జీఓ కూడా జారీ అయిందని అసత్యం పలికిందన్నారు. పైగా గ్రామస్తులు, రైతులపై బెదిరింపులకు పాల్పడటంతో వీరిపై కేసులు నమోదు చేయడంతో పాటు, చెట్లను నరికినందుకు అల్టా చట్టం మేరకు కేసు నమోదు చేయాలని తహసీల్దార్‌ను కోరారు.

తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కంపెనీ ప్రతినిధి..

కొండపాపాయపల్లె పశువుల మేతకు సంబంధించిన 224 సర్వేనంబర్ ఉన్న భూమిని తమకు కేటాయించారని ప్రభుత్వం నుంచి కూడా జీఓ వచ్చిందని చెబుతూ వచ్చిన సేల్ కంపెనీ ప్రతినిధి నరేన్ చౌదరి పెద్దముడియం మండల తహసీల్దార్ నరసింహులును కలిశారు. తాము సోలార్ కోసం భూములను కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను కోరామని, దానికి సంబంధించిన ఫైల్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

విద్యుత్ చార్జీల పెంపుతో పేదల నడ్డి విరుస్తున్న బాబు

- ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రగల్భాలు
- అధికారంలోకి వచ్చాక కరెంటు చార్జీలు, రిజిస్ట్రేషన్ చార్జీల బాదుడు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : విద్యుత్ చార్జీల పెంపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల నడ్డి విరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని, పైగా తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన పదినెలల్లోనే రెండు సార్లు ధరలు పెంచారన్నారు. ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీల పేరుతో ప్రతినెలా వినియోగదారుల ముక్కుపిండి వేలకోట్ల భారం వేస్తున్నారన్నారు. గత డిసెంబర్‌లో రూ.6450 కోట్ల భారం మోపారని, ఈ నెలలో రూ.9వేలకోట్ల చార్జీలు వేశారన్నారు. మొత్తం మీద విద్యుత్‌చార్జీల రూపేణ రెండు నెలల్లోనే రూ.15వేల కోట్ల భారం ప్రజలపై మోపారన్నారు. మరోవైపు భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన బండ వేశారన్నారు.

కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం పెట్రోల్, గ్యాస్ ధరలు పెంచి సామాన్యుల బతుకు దుర్భరం చేసిందన్నారు. గ్యాస్ సిలిండర్‌పై రూ.50లు పెంచి, పెట్రోల్, డీజిల్ ధరలను కూడా పెంచడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రభావం నిత్యావసర ధరలపై పడనుందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇలాగే గ్యాస్ ధర పెంచితే దివంగత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఆ భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాయడం మినహా చేసిందేమీ లేదన్నారు. సంపద సృష్టిస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు...సంపద సృష్టించకపోగా ఇప్పటికే రూ.1.64 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. వారం వారం అప్పులు చేస్తున్నా ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు ఇవ్వలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇంత తక్కువ కాలంలో దేశంలో ఏ రాష్ట్రంలో ఇన్ని అప్పులు చేయలేదన్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి, సంక్షేమ పథకాలైనా అమలు చేశారా...అంటే అదీ లేదన్నారు. జన్మభూమి పథకానికి పేరు మార్చి పీ–4 అనే కొత్త స్కీం తెచ్చారన్నారు. టీడీపీ నాయకులకు మేలు చేయాలన్న ఆలోచనతో తీసుకొచ్చిన ఈ స్కీంకు దాతల సహకారం ఉండదన్నారు. సూపర్ సిక్స్ పథకాలని చెప్పి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేర్చాలని, అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్, శ్రీరంజన్‌రెడ్డి, షఫీ పాల్గొన్నారు.

ఎస్ఐ ఇల్లు సహా నాలుగు చోట్ల చోరీ

- ఎస్ఐ ఇంట్లో చొరబడిన దొంగలు
- రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో భారీ చోరీ
- 60 తులాల బంగారు, రూ. 12 లక్షలు నగదు, 3 కిలోల వెండి అపహరణ
- శుభకార్యానికి కర్నూలుకు వెళ్లిన ఓ కుటుంబం
- ఐదుగురు కలిసి చోరీ చేసినట్లు సీసీ కెమెరాల్లో నిర్ధారణ



బాధితులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన భార్య వసంత, చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగిన దృశ్యాలు

ప్రొద్దుటూరు క్రైం : కొన్ని రోజుల క్రితం వచ్చిన అల్లు అర్జున్ పుష్ప–2 సినిమా అందరికీ గుర్తే ఉంటుంది. ఇందులో ఎర్రచందనం స్మగ్లర్ పాత్రలో నటించిన అల్లు అర్జున్ పోలీసులకు దొరకకుండా వారికి చుక్కలు చూపిస్తాడు. కథలో భాగంగా పుష్ప చెప్పే 'దమ్ముంటే పట్టుకో షెకావత్తు.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేట్టు' అనే డైలాగ్ బాగా పాపులర్ అయింది. ప్రొద్దుటూరులో కూడా కొన్ని రోజుల నుంచి వరుస దొంగతనాలు చేస్తూ దొంగలు పోలీసులకు చుక్కలు చూపిస్తున్నారు. ఇళ్లల్లోకి చొరబడి వరుసగా చోరీలు చేస్తున్నా పోలీసులు వారిని పట్టులేకపోతున్నారు. ఇన్ని రోజులు ప్రజల ఇళ్లలో చోరీలు చేసిన దొంగలు ఈ సారి ఎస్ఐ ఇంటినే టార్గెట్ చేశారు. ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐ ధనుంజయ ఇంట్లో చోరీ చేసి 'దమ్ముంటే పట్టుకో ధనుంజయ..! పట్టుకుంటే వదిలేస్తా దొంగతనాలు' అంటూ ఎస్ఐకే సవాల్ విసురుతున్నారు. ఎస్ఐ అనే భయమే లేకుండా ఆయన ఇంట్లో హుండీని ఎత్తుకెళ్లారు. ఎస్ఐ ఇంట్లో చోరీ జరగడం జిల్లాలో హాట్ టాపిక్ అయింది. ప్రొద్దుటూరులో దొంగలు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగు ఇళ్లల్లో చొరబడ్డారు. ఒక ఇంట్లో మాత్రం పెద్ద ఎత్తున బంగారు, వెండి, నగదును దొంగలు దోచుకెళ్లారు..ఎస్ఐ ఇంట్లో హుండీని ఎత్తుకెళ్లారు. మిగిలిన రెండు ఇళ్లల్లో విలువైన వస్తువులేమీ దొంగలకు దొరకలేదు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరులోని బొల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న నరాల బాలిరెడ్డి కాలనీలో విలాసవంతమైన ఇళ్లను నిర్మించారు. ఈ కాలనీలోని నాలుగు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి 1.30 సమయంలో దొంగలు పడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎనమల చంద్రశేఖర్‌రెడ్డి ఇంట్లో సుమారు 60 తులాల బంగారు, 3 కిలోల వెండి, రూ. 12 లక్షల నగదును దోచుకెళ్లారు. వారి ఇంటి సమీపంలో ఉన్న టూ టౌన్ ఎస్ఐ ధనుంజయ ఇంట్లో హుండీని దోచుకెళ్లారు. ఎస్ఐ ఇంటి పక్కనే ఉన్న ఈశ్వరరెడ్డి, ఎల్లంశెట్టి రాజా ఇంట్లో విలువైన బంగారు నగలు ఏమీ లేకపోవడంతో చేసేదేమి లేక దొంగలు వెళ్లిపోయారు.

రెండు రోజులు కూడా లేని పెళ్లి ఆనందం

చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని వివాహం ఈ నెల 13,14 తేదీల్లో ప్రొద్దుటూరులోని వైవీఆర్ కల్యాణమండపంలో జరిగింది. ఇందులో భాగంగా ఇంటికి తాళం వేసి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులందరూ 16న కర్నూలుకు వెళ్లారు. బంధువులతో పాటు ఆ రోజు రాత్రే చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఇంటికి రావాలనుకున్నారు. అయితే పెళ్లికుమారుడి తల్లిదండ్రులు రాత్రికి ఉండాలని పెళ్లికుమార్తె బంధువులు చెప్పడంతో వారు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో గురువారం ఉదయం 5 గంటల సమయంలో వారి బంధువుల అమ్మాయి ఒకరు చంద్రశేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి మన వీధిలో దొంగతనం జరిగిందని చెప్పింది. కంగారు పడిన అతను మన ఇంటి వద్దకు వెళ్లి చూడమ్మా అని చెప్పాడు. అక్కడికి వెళ్లిన ఆమె ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పడంతో చంద్రశేఖర్‌రెడ్డి షాక్‌కు గురయ్యాడు. ఇంటి తలుపు లాకర్‌ను విరిచేసిన దొంగలు ఇంట్లో కబోర్డుల్లో ఉన్న వస్తువులు, దుస్తులను చెల్లా చెదురు చేశారు. వాటిలో ఉన్న బంగారు నగలు, డబ్బు, వెండి వస్తువులను దోచుకెళ్లారు. అలాగే పెళ్లి కొడుకుకు చెందిన 15 జతల కొత్త బట్టలు, 12 పట్టు చీరెలను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన విషయం తెలియగానే చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి వసంతలు హుటాహుటీన ప్రొద్దుటూరుకు వచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి కూడబెట్టుకున్న బంగారు నగలు, డబ్బులు లేకుండా పోయాయంటూ వసంత రోదించసాగింది. కుమారుడికి బంధువులు వెండి వస్తువులను కానుకలుగా అందచేశారు. వాటిలో ఒక్కటి కూడా లేకుండా దొంగలు ఊడ్చుకొని వెళ్లారు. ఇంట్లో పెళ్లి జరిగిన ఆనందం రెండు రోజులు కూడా వారికి దక్కలేదు. పెద్ద మొత్తంలో నగదు, బంగారు దొంగల పాలు కావడంతో కుటుంబ సభ్యులతో పాటు బంధువులు విషాదంలో మునిగిపోయారు.

ఇళ్లన్నీ పక్క పక్కనే..

కాలనీలో చోరీకి గురైన ఇళ్లన్నీ పక్క పక్కనే ఉన్నాయి. చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు మళ్లిపెళ్లి నిమిత్తం కర్నూలుకు వెళ్లగా ఎస్ఐ ధనుంజయ కుటుంబ సభ్యులు ఎవ్వరూ ఇంట్లో లేరు. ఎల్లంశెట్టి రాజా కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లాడు. ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లారు. ఈశ్వరరెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు వెళ్లిన దొంగలకు ఏమీ దొరకలేదు. వారి ఇంట్లో సీసీ కెమెరాలను పసిగట్టిన దొంగలు సీడీఆర్‌తో సహా వాటిని ఎత్తుకెళ్లారు. చంద్రశేఖర్‌రెడ్డి ఇల్లు కాలనీకి చివరలో ఉంది. దీంతో దొంగల పని సులభతరమైంది.

అర్ధరాత్రి దాటిన తర్వాత కాలనీలోకి ప్రవేశించిన ఐదుగురు దుండగులు

అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 1.10 నిమిషాలకు ఐదుగురు వ్యక్తులు కాలనీలోకి ప్రవేశించారు. దొంగలు కాలనీలో హల్‌చల్ చేసిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో కనిపించాయి. సీసీ కెమెరా దూరంగా ఉండటంతో వారి ముఖాలు స్పష్టంగా కనిపించలేదు. ఐదుగురు వ్యక్తులు కూడా యువకుల్లా కనిపిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. చోరీ జరిగిన ఇళ్లలో క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డిలు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎస్ఐ ఇంటిని వదలని దొంగలు

ఎస్ఐ ధనుంజయుడు ఇంట్లో దొంగతనం జరగడం పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది. పోలీసుల ఇళ్లకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల ఇళ్ల పరిస్థితి ఏంటని అంటున్నారు. ఎస్ఐ ధనుంజయుడు తన యూనిఫాంను సోఫాపై ఉంచారు. యూనిఫాంను చూసిన దొంగలు ఇది పోలీసు అధికారి ఇల్లని గ్రహించి ఉంటారు. అయినా ఏ మాత్రం భయపడకుండా ఇంట్లో ఉన్న హుండీని ఎత్తుకొని వెళ్లారు.


చోరీ జరిగిన ఎస్ఐ ధనుంజయ ఇల్లు

మహిళ అదృశ్యం


మంజుల లక్ష్మీదేవి(ఫైల్)

కొండాపురం : మండల కేంద్రంలోని తాతయ్యగుట్ట వీధిలో నివాసం ఉండే మంజుల లక్ష్మీదేవి(43) అనే మహిళ బుధవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ యు.ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు లక్ష్మీదేవి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతున్నానని తన భర్త మంజుల గుర్రప్పకు చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.